# నిర్బంధంలో తెలంగాణ

## • మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా శంభీపూర్‌లో..



మేడ్చల్ జిల్లా శంభీపూర్‌లో శంభీపూర్ రాజు ఇంటి నుంచి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నివాసానికి బయలుదేరుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

## • కాప్రా సైనిక్‌పురిలో..



హైదరాబాద్‌లోని సైనిక్‌పురి నివాసంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

## • ఆదిలాబాద్ జిల్లాలో..




నేరడిగొండలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

## • మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలో..



కూకట్‌పల్లిలోని తన నివాసంలో హౌస్ అరెస్ట్‌కు వచ్చిన అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

## • భద్రాద్రి జిల్లా ఇల్లెందులలో..



బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ గూండాగిరికి నిరసనగా భద్రాద్రి జిల్లా ఇల్లెందులో నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

## • సిద్దిపేట జిల్లాలో..



గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

## • హైదరాబాద్‌లో..



మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసం వద్ద అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌ను అరెస్ట్ చేసి కారులో తీసుకెళ్తున్న పోలీసులు



వికారాబాద్ జిల్లా పరిగిలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేస్తున్న ఎస్‌ఐ సంతోష్, పోలీసులు



కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లిలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌ను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

## • మహబూబాబాద్ జిల్లాలో..



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

# ఇమేజ్ డ్యామేజ్ చేసి!

## రాత్రికి రాత్రి స్టాండ్ మార్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం

- నష్టమంతా జరిగాక గుర్తొచ్చిన హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్
- కౌశిక్‌రెడ్డిపై గాంధీ దాడిని ఎంజాయ్ చేసిన ప్రభుత్వ పెద్దలు
- బీఆర్‌ఎస్ ఇంటి సమస్యగా చిత్రీకరిస్తూ రాజకీయ వినోదం
- బూమరాంగ్ కావటంతో హడావుడిగా నష్ట నివారణ చర్యలు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరం.. ఇక్కడ చీమ చిటుక్కు మన్నా తెలంగాణతో పాటు పలు రాష్ర్టాలు ఉలిక్కిపడతాయి. ఇప్పుడే కాదు.. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు సైతం ఈ మినీ భారతంలో చిన్న సంఘటన చోటుచేసుకున్నా ఇతర ప్రాంతాల్లోని కోట్ల మంది ఆందోళన చెందుతారు. అలాంటిది.. నిన్నటిదాకా సినిమాల్లోనే చూసిన దృశ్యాలు గురువారం నగర రోడ్లపై కనిపించాయి. చరిత్రలో తొలిసారిగా ఆంధ్రా ఫ్యాక్షనిజం ఛాయలు అందరినీ కలవరపరిచాయి. అత్యంత సురక్షితమైన ప్రాంతంగా విరాజిల్లుతున్న హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో పదుల సంఖ్యలో వాహనాల పుట్‌బోర్డుపై కొందరు నిలబడి తొడగొడుతూ వెళ్లి ఒక ఎమ్మెల్యే మీద దాడి చేయటం అందరినీ నివ్వెరపరిచింది. సగటు వ్యక్తి దీనిని హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు ఇది డ్యామేజ్‌గా భావించాడు. ఆందోళన పడ్డాడు. అధికారంలో ఉన్న పెద్దలు మాత్రం దీనిని రాజకీయ వినోదంగా చూశారు. సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ మీడియా చిట్‌చాట్‌లో ఇది బీఆర్‌ఎస్ అంతర్గత వ్యవహారం, తమకేం సంబంధం అని అభిప్రాయపడ్డారు. అంటే రాజకీయ నేతగా ఆయన రాజకీయ కోణంలోనే చూశారే తప్ప సీఎం హోదాలో పరిణామాలను విశ్లేషించుకోలేదు. పర్యవసానంగా 'చట్టం తన పని తాను' చేయలేకపోయింది. యధా రాజా.. తథా ప్రజా అన్నట్టు రాజకీయ కోణంలోనే వ్యవహరించింది. అందుకే కొండాపూర్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని నిర్బంధించిన చట్టం.. కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అరికపూడి గాంధీని మాత్రం కట్టడి చేయలేకపోయింది.

**అధికారంలో ఉన్నామన్న వాస్తవాన్ని మరిచి**


రాజకీయ కోణంలో కాంగ్రెస్ ఇదే కోరుకోవచ్చు. కానీ ఆ పార్టీ అధికారంలో ఉన్నదనే వాస్తవాన్ని గుర్తించకపోవడంతో హైదరాబాద్ ఒక్కసారి అభద్రతకు లోనైంది. అంతర్జాతీయంగా భౌగోళికంగానే కాదు.. శాంతిభద్రతల పరంగా ఎవరెస్టులాంటి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కుప్పకూలిపోయింది. ఈ సత్యాన్ని పాలకులు గుర్తించేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. నిన్నటిదాకా అనేక ప్రశంసలు అందుకున్న పోలీస్‌శాఖ.. 'వైఫల్యం' అనే అప్రతిష్ఠను మూటగట్టుకోవాల్సి వచ్చింది. దీంతో రాత్రికి రాత్రి కాంగ్రెస్ ప్రభుత్వానికి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ బోధపడింది. శుక్రవారం ఉదయం నుంచే నష్ట నివారణ చర్యలు మొదలుపెట్టింది. తమ కండ్ల ముందే గురువారం అరికపూడి గాంధీ వర్గీయులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నా ప్రేక్షకపాత్ర పోషించిన పోలీస్ శాఖ.. 'ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే' కఠినంగా వ్యవహరిస్తామంటూ హూంకరించింది. అన్నింటికీ మించి నిన్నటిదాకా రాజకీయ కోణంలోనే పరిణామాల్ని విశ్లేషించిన సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం మాత్రం హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తే ఊరుకోం అంటూ హెచ్చరించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**పదేండ్లలో ఒక్క దుర్ఘటన లేదు**

ఉమ్మడి ఏపీ పాలనలో హైదరాబాద్‌లో అనేక పర్యాయాలు కర్ఫ్యూ విధించాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఒక దశలో సీఎం కుర్చీ కోసం శాంతిభద్రతలనూ ఫణంగా పెట్టిన దాఖలాలు ఉన్నాయి. 4 సార్లు ఉగ్రవాదుల బాంబు పేలుళ్లు జరిగాయి. రాయలసీమ ఫ్యాక్షనిజం కోణంలోనూ హత్యలు జరిగాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేండ్లలో చిన్న దుర్ఘటన కూడా చోటుచేసుకోలేదు. అటు ఫ్యాక్షనిజం.. ఇటు ఉగ్రవాదం.. ఏ కోణంలో కూడా ఒక్క ఎఫ్‌ఐఆర్ నమోదు కాలేదు. అందుకే హైదరాబాద్ నగరం సురక్షిత నగరంగా పేరొంది అంతర్జాతీయ కంపెనీలు క్యూ కట్టాయి. ఐటీ రంగంలో సేఫెస్ట్ సిటీగా బ్రాండ్ ఇమేజ్ ఏర్పడటంతో ఐటీ రంగ ఉత్పత్తులు ఐదు రెట్లు పెరిగాయి.

### 9 నెలల్లో తలకిందులు

9 నెలల కాలంలోనే హైదరాబాద్ శాంతి భద్రతల్లో భారీ మార్పు.. నడిరోడ్డుపై హత్యలు పెరిగిపోయాయి. అంతర్రాష్ట్ర దొంగల ముఠాలు ప్రవేశించాయి. సీఎం రేవంత్ కూడా తన సమీక్షలో నగరంలో శాంతిభద్రతలపై ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీలోనూ పెద్ద ఎత్తున చర్చ జరిగింది. చాలా వరకు ఘటనలు హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలోనే జరిగాయి. సైబరాబాద్ పరిధిలో పెద్దగా సంఘటనలు చోటుచేసుకోలేదు. గురువారం చోటుచేసుకున్న సంఘటన మాత్రం ఐటీ కారిడార్‌లో శాంతిభద్రతలపై ప్రజల్లో ఆందోళన మొదలైంది. పదుల సంఖ్యలో వాహనాల్లో వెళ్లి ఒక ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేయటమంటే.. సామాన్యుడి పరిస్థితి ఏమిటన్న సందేహం వచ్చింది. మీడియాలో లైవ్ కవరేజీతో వెళ్లి దాడి చేయటం, పోలీస్ బలగాలు ఉన్నా దాటుకొని వెళ్లటం.. పోలీస్‌శాఖ వైఫల్యమేనని తేలిపోయింది. గురువారం రాత్రి దాకా ఈ పరిణామాల్ని రాజకీయ వినోదంలా ఆస్వాదించిన ప్రభుత్వ పెద్దలు.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తుందనే వాస్తవాన్ని గుర్తించలేకపోయారు. నష్టం జరిగిపోయిన తర్వాత నిజాన్ని తెలుసుకున్నారు. దాంతో శుక్రవారం శాంతిభద్రతల కోణంలో హడావుడి మొదలైంది. రాత్రికిరాత్రి బ్రాండ్ ఇమేజ్ గుర్తుతెచ్చుకున్న రేవంత్ సర్కారు.. తెల్లారేసరికి స్టాండ్ మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



# ప్రభుత్వ ఒత్తిడిలో పోలీస్?

- వరస ఫెయిల్యూర్స్‌తో పోలీస్‌శాఖకు మకిలీ
- ప్రతిపక్ష నేతల అరెస్టులెందుకో తెలియదు
- కాంగ్రెసోళ్లు దాడిచేస్తే కేసుల్లేవ్, అరెస్టుల్లేవ్
- ప్రభుత్వ పెద్దల ఆదేశాలకు మాత్రం జీ హుజూర్!
- గాంధీ ఇష్యూలో డీజీపీ, కమిషనర్లపై ప్రభుత్వ పెద్ద ఆగ్రహం!
- ఏరికోరి తెచ్చుకుంటే ఇజ్జత్ తీస్తున్నారంటూ గుస్సా

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): 'కరవమంటే కప్పకు కోపం.. విడువమంటే పాముకు కోపం' అన్న చందంగా తయారైంది తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారుల పరిస్థితి. రాజకీయ చదరంగంలో ప్రభుత్వ పెద్దల నుంచి రోజురోజుకూ పెరుగుతున్న ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నట్టు వాపోతున్నారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలను గుడ్డిగా పాటిస్తూ.. ఏం చేస్తున్నామో? ఏం చేయకూడదో? కూడా అర్థంకాని స్థితికి కొందరు పోలీసు ఉన్నతాధికారులు చేరుకున్నారు. పదేండ్ల పాటు ఫోకల్‌లో ఉన్నా.. నాన్ ఫోకల్‌లో ఉన్నా.. ఎవరి పని వారు కామ్‌గా చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసు వ్యవస్థ పటిష్టానికి కొన్ని తప్పనిసరిగా పాటించాల్సిన విధులను కూడా సమర్థంగా నిర్వర్తించలేకపోతున్నామని కొందరు సీనియర్ అధికారులు చెప్తున్నారు. కేసీఆర్ హయాంలో పోలీసు వ్యవస్థకు మెరుగులు దిద్దారని.. చేయాల్సినవి, చేయకూడనివి, తప్పనిసరిగా పాటించాల్సిన విధులపై ఆయన సీరియస్‌గా ఉండేవారని, ఇప్పుడు పరిస్థితి అంతా తలకిందులవుతుండగా.. తమపై తీవ్రస్థాయిలో ఒత్తిడి పెరుగుతున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

**వరస ఫెయిల్యూర్స్‌తో వ్యతిరేకత**

కొందరు పోలీసు అధికారుల తీరు.. మొత్తం వ్యవస్థకే మకిలీ తెచ్చింది. గుడ్డిగా ప్రభుత్వ పెద్దల ఆదేశాలు పాటిస్తూ వరుస తప్పిదాలు చేస్తుండటంతో ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నది. బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్ అక్రమ అరెస్టు దగ్గర్నుంచి గురువారం రాత్రి మాజీమంత్రుల అక్రమ అరెస్టు, గురువారం అర్ధరాత్రి అక్రమ నిర్బంధాల వరకూ ఏ క్లారిటీ లేకుండా తప్పు మీద తప్పు చేస్తూనే ఉన్నారు. ఓ తప్పుడు కేసులో క్రిశాంక్‌ను బలవంతంగా ఇరికించేందుకు.. గత ఏప్రిల్ 30 నుంచి మే 10 వరకు ముప్పుతిప్పలు పెట్టారు. ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసి.. 10 రోజుల్లో 6 సెషన్ కోర్టులకు క్రిశాంక్ కేసు బెయిల్ బదిలీ చేసినా.. క్రిశాంక్ ఫోర్జరీ చేసినట్టు ఆధారాలు చూపలేకపోయారు. ఆ తర్వాత సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్నారంటూ తెలంగాణ సోషల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌ను సైతం అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఆయన అరెస్టు చూపేందుకు అధికారులు కుస్తీపడ్డారు. ఫిరాయింపు ఎమ్మెల్యే గాంధీ, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇష్యూలోనూ బీఆర్‌ఎస్ నేతలను ఎందుకు అరెస్టు చేశారో చెప్పలేకపోయారు. మాజీమంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి తదితరుల అరెస్టులపై సరైన క్లారిటీ లేక అభాసుపాలయ్యారు. ఎందుకు అరెస్టు చేశారో చెప్పుకోలేక పోలీసు ఉన్నతాధికారులు తిప్పలు పడి బీఆర్‌ఎస్ బృందాన్ని బతిమిలాడుకొని మరీ వదిలిపెట్టారు.

**ప్రతిపక్షాలపై దాడులైతే అరెస్టుల్లేవ్!**

తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నేతలు, వారి ఇండ్లు, ఆస్తులను ఎవరైనా కాంగ్రెస్ కార్యకర్తలు, గూండాలు ధ్వంసం చేస్తే వారిపై పేరుకే కేసులు నమోదు చేస్తున్నారు. దాడులకు తెగబడిన వారిని అరెస్టు చేసేందుకు మాత్రం సాహసించటం లేదు. అరెస్టు చేసినా సాయంత్రానికల్లా ఇంటికి పంపేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఖమ్మంలో వరద బాధితులకు సాయం చేసేందుకు బీఆర్‌ఎస్ అగ్రనేతలు వెళ్తే.. అక్కసుతో కాంగ్రెస్ గూండాలు దాడులు చేశారు. రాళ్లు, కర్రలతో నేతల కార్ల అద్దాలు ధ్వంసం చేశారు. సంతోష్‌రెడ్డి అనే వ్యక్తి ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నా అనుమానాస్పద వ్యక్తులు రెండు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొన్నారని తెలిసింది. అందులో ఒకటి జీరో ఎఫ్‌ఐఆర్ అని విశ్వసనీయ సమాచారం. అంతకుముందు సిద్దిపేటలో మాజీ మంత్రి హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడిచేసిన కాంగ్రెస్ గూండాలపై నేటికీ ఎలాంటి చర్యలు లేవు. నల్లగొండలో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే కిశోర్‌పై కాంగ్రెస్ గూండాలు దాడికి తెగబడితే ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సీఎం సొంత గ్రామంలో రుణమాఫీ వివరాలు తెలుసుకునేందుకు వెళ్లిన మహిళా జర్నలిస్టులపై దాడి చేసిన వారిపైనా చర్యలు లేవు. ప్రస్తుతం ఎమ్మెల్యే గాంధీ, అతని అనుచరులపై హత్యాయత్నం కేసులు నమోదుచేసినా కేవలం స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపేయటం, నిందితులకు పోలీసు స్టేషన్‌లో రాచమర్యాదలు చేయటం వెనుక అధికార పార్టీ పెద్దల ఒత్తిడి ఉన్నదని తెలుస్తున్నది. ఈ దాడుల్లో అధికార పార్టీకి చెందినవారు ఎవరున్నా సరే.. వారికి స్టేషన్ బెయిల్ ఇచ్చి, కుర్చీల్లో కూర్చోబెట్టి, అవసరమైతే చాయ్, స్నాక్స్ ఇచ్చి, రాత్రికి ఉండాల్సి వస్తే బిర్యానీ సైతం అందిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అదే ప్రతిపక్ష పార్టీకి చెందిన వారైతే విధులకు ఆటంకం కలిగించారనే పేరుతో ఉల్టా కేసులు కూడా పెడుతున్న ఘటనలు కలవరపెడుతున్నాయి.

### మీకు చేతకాదంటే చెప్పండి

'బీఆర్‌ఎస్ హయాంలో ఎక్కడో నాన్ ఫోకల్‌లో ఉన్న మిమ్మల్ని మన ప్రజాప్రభుత్వంలో ఫోకల్‌లోకి తీసుకొస్తే.. మీరు చేసేది ఇలాగేనా? గాంధీ, కౌశిక్‌రెడ్డి ఇష్యూలో ఎందుకు ఇంత లొల్లి జరిగింది? అంత జరిగేంత వరకు మీరేం చేస్తున్నారు?' అంటూ ఓ ప్రభుత్వ పెద్ద శుక్రవారం పొద్దుపొద్దునే పోలీసు బాస్‌లకు తలంటినట్టు తెలిసింది. తన జిల్లా బోర్డర్ వరకూ ఈ ఇష్యూ వెళ్లడం, తన జిల్లా నుంచి కూడా బీఆర్‌ఎస్ సానుభూతిపరులు కేశంపేట పోలీస్‌స్టేషన్‌కు రావటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. 'ఏరికోరి తెచ్చుకుంటే ఎందుకబ్బా ఇజ్జత్ తీస్తారు. మీకు చేతగాదంటే చెప్పండి బీఆర్‌ఎస్ హయాంలో చేసిన వాళ్లతోనే పనిచేయించుకుంటా' అంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చినట్టు సమాచారం. ఇంత జరుగుతుంటే తీరిగ్గా వచ్చి ఇంటెలిజెన్స్ సమాచారం ఇస్తారా? ప్రజల్లోకి ఎలాంటి సంకేతాలు వెళ్తాయో మీకు తెలుసా?' అంటూ ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. బీఆర్‌ఎస్ బృందాన్ని సైబరాబాద్ సీపీ ఆఫీసు వరకు ఎందుకు రానిచ్చారని, వాళ్లందరినీ కేశంపేట, తలకొండపల్లివైపు ఎందుకు తీసుకెళ్లారని కూడా ప్రశ్నించినట్టు తెలిసింది. ఇలాగైతే కష్టం అంటూ గట్టిగానే వార్నింగ్ ఇచ్చినట్టు సమాచారం. మొత్తానికి పదేండ్ల పాలనలో సగర్వంగా తలెత్తుకొని బతికిన తెలంగాణ పోలీస్ వైభవం.. ప్రజాపాలనలో రాజకీయ క్రీడలో రోజురోజుకు దిగజారుతున్నది. అధికారంవైపే కొమ్ముకాయడం, నాయకులు చెప్పినట్టే వినడంతో అభాసుపాలవుతున్నట్టు పోలీస్ వర్గాల్లోనే చర్చ జరుగుతున్నది.



రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మొదళ్లగూడలోని నివాసంలో హౌస్ అరెస్టు చేసిన నందిగామ పోలీసులు



మంచిర్యాల జిల్లా జైపూర్ పోలీసు స్టేషన్‌లో బీఆర్‌ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, నాయకులు

**CVR COLLEGE OF ENGINEERING**
Mangalpalli (V), Ibrahimpatan (M), RR Dist - 501 510
**AN AUTONOMOUS INSTITUTION**
The College invites applications for **Category- B seats in M.Tech.** Programme for the academic year 2024-25 in the following courses.

1. Artificial Intelligence - 05
2. Data Sciences - 05
3. Electrical Power Engineering - 05
4. Embedded Systems - 05
5. Structural Engineering - 05
6. VLSI System Design - 05

Please contact college office on or before 21st September 2024
Phone: 08414661601, 08414661674 / 75
TUITION FEE Rs. 81,000/- http://cvr.ac.in - Hon. Secretary